క్లుప్తంగా

మంత్రి హరీశ్‌రావును కలిసిన మున్సిపల్ చైర్మన్



పుష్పగుచ్ఛం అందజేస్తున్న పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తన జన్మదిన సందర్భంగా మంగళవారం రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావును కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి స్వయంగా పాండురంగారెడ్డి ఇంటికి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పలు కాలనీ సంఘాల అధ్యక్షులు, కౌన్సిలర్లు, అధికారులు కూడా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ పట్టణాన్ని సమస్యలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు. సీఎం కేసీఆర్ ఇప్పటికే రూ.55 కోట్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. దాదాపు అన్ని ప్రధాన రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఆ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొర్ర వెంకట్‌రెడ్డి,దశరథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని ఆయా కాలనీలలో మంగళవారం పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. వర్షాకాలం కావడంతో వివిధ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో మన్సుర్‌పూర్, పోస్టాఫీస్ వీధి, శాస్త్రీనగర్, వివేకానందకాలనీ, మంగల్‌పేట్ తదితర కాలనీలలోని మురుగుకాలువలలో పేరుకుపోయిన చెత్తను తొలగింపజేశారు. శానిటరీ అధికారి శ్రీనివాస్ పనులను పర్యవేక్షించారు.

పెండింగ్ పనులను పూర్తిచేయండి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంతంలో అసంపూర్తి ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో మంగళవారం అభివృద్ధి పనులపై మున్సిపల్, పంచాయత్‌రాజ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అసంపూర్తిగా ఉన్న రోడ్లు, డ్రైనేజీ పనులకు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓ వెంకారెడ్డి, ఆత్మచైర్మన్ పెంటారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ అడ్మిషన్ విధానం రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): బీసీ హాస్టళ్లలో అడ్మిషన్ నిమిత్తం ఆన్‌లైన్ విధానాన్ని తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ అన్నారు. ఆన్‌లైన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఈ ఏడాది ప్రభుత్వం బీసీ హాస్టళ్లో ఆన్‌లైన్ ద్వారా అప్లికేషన్ విధానాన్ని తీసుకొచ్చి విద్యార్థులను ఇబ్బందులను గురిచేయడం సరికాదన్నారు. ఆన్‌లైన్ పద్ధతి ద్వారా ఒక దగ్గర కాలేజ్ ఉంటే మరో దగ్గర హాస్టల్ సౌకర్యం కల్పించడంతో విద్యార్థులు ప్రయాణానికి ఇబ్బంది పడి కళాశాలలో టీసీలు తీసుకొని ఇంటికి వెళ్లిపోతున్న పరిస్థితి నెలకొందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల మహేష్ నాయకులు కుమార్ పాల్గొన్నారు.

రైతుబంధు దరఖాస్తు గడువు పెంపు

రాయికోడ్(అందోల్): జూన్ 16వ తేదీ నుంచి కొత్తగా భూపట్టా పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతుబంధు పథకానికి దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 7వ తేదీ వరకు పెంచినట్లు మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వచ్చామా.. పోయామా!

- నామమాత్రంగా గ్రామసభల నిర్వహణ
- కానరాని ప్రజల భాగస్వామ్యం
- సమస్యల పరిష్కారంపై జరగని చర్చ
- అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై అసంతృప్తి



తాలెల్మ గ్రామ పంచాయతీ భవనం

మునిపల్లి(అందోల్): గ్రామసభలకు హాజరయ్యామా.. సంతకాలు పెట్టామా లేదా అన్నట్లుగా నుసర్పంచ్‌లు, వార్డుమెంబర్లు, అధికారులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ప్రజా సమస్యల పరిష్కారానికి రెండు నెలలకోసారి నిర్వహించే గ్రామసభలను తూతూ మంత్రంగా నిర్వహిస్తుండటంతో సమస్యలు ఎక్కడికక్కడే ఉంటున్నాయి. ఎంతో ప్రాధాన్యత ఉన్న గ్రామసభల నిర్వహణపై శ్రద్ధ లేకపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు బేఖాతరు

నిబంధనల ప్రకారం గ్రామసభ నిర్వహించే తేదీని ఒక రోజు ముందుగానే పంచాయతీతో పాటు అనుబంధ గ్రామసభల్లో కార్యదర్శులు, సిబ్బందితో దండోరా వేయించాలి. విధిగా 18శాఖల అధికారులు, జనాభాలో 20శాతం మంది గ్రామసభకు హాజరయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. కనీసం 50 మందితో గ్రామసభను ఏర్పాటు చేయవచ్చు. సభకు హాజరయ్యే అధికారులు గ్రామంలోని సమస్యల వివరాల నమోదుతో పాటు ఆదాయ వ్యయాలపై చర్చించే అవకాశం ఉంటుంది. కానీ.. ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడంలేదు.

గ్రామసభలకు దూరంగా ప్రజలు

గ్రామసభలపై ప్రజలు ఆసక్తి చూపడంలేదు. సభలో కేవలం పంచాయతీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ, ఆశాలు మాత్రమే తప్పా మిగతావారు పాల్గొనడంలేదు. దీనికి కారణం గత గ్రామసభల్లో ప్రస్తావించే ఏ సమస్యలకూ పాలక మండలి పరిష్కారం చూపకపోవడమే కారణం. దీంతో సమస్యలకు పరిష్కారం చూపని సభలకు వెళ్లడం ఎందుకనే భావన ప్రజల్లో నాటుకుపోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామ సభలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

సంతకాలకే పరిమితం



గ్రామసభలు ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక కావాలి. కానీ.. చాలా గ్రామాల్లో గ్రామసభల నిబంధనలను పాటించడంలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు తూతూ మంత్రంగా గ్రామసభలు నిర్వహిస్తూ సంతకాలకే పరిమితమవుతూ సమస్యలను గాలికొదిలేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామసభల నిర్వహణపై దృష్టి సారించాలి.

– ఉనలి నవీన్, హస్నాబాద్, రాయికోడ్ మండలం

ప్రజల భాగస్వామ్యం అవసరం



గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం. సభల నిర్వహణపై కార్యదర్శులు గ్రామాల్లో దండోరా వేయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ప్రజలు సభకు స్వచ్ఛందంగా హాజరుకావాలి. గ్రామసభల నిబంధనలను తప్పక పాటించాలి. దీంతో గ్రామసభల దృష్టికి వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుంది.

– సురేశ్‌మోహన్, డీపీఓ

అల్లూరి జీవితం ఆదర్శం



పటాన్‌చెరు: అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం అందరికీ ఆదర్శనీయమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా క్యాంపు కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, నాయకులు పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా యువజన నాయకులు ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో బొల్లారంలో యువజన నాయకులు అల్లూరి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతారామరాజు చేసిన త్యాగాలను కొనియాడారు.

బోనాల పండగ ఏర్పాట్లపై సమావేశం

పటాన్‌చెరు టౌన్: ఈ నెల 13వ తేదీన పట్టణంలో నిర్వహించనున్న బోనాల పండగ ఏర్పాట్లపై మంగళవారం కోదండ సీతారామస్వామి ఆలయంలో సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ రెండేళ్లుగా రెండు రోజుల పాటు నిర్వహించే బోనాల పండగను ఈ ఏడాది ఒకేరోజు నిర్వహించాలని పట్టణ ప్రజల విజ్ఞప్తి మేరకు ఒకేరోజు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ జైపాల్, మాజీ కార్పొరేటర్లు శంకర్‌యాదవ్, సపానాదేవ్, గూడెం మధుసూదన్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి



హత్నూర: నివాళులర్పిస్తున్న నాయకులు



నారాయణఖేడ్‌లో..

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 77వ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన దొడ్డి కొమురయ్య త్యాగాలను మరవలేమని తెలిపారు.

ప్రహరీ లేక పరేషాన్

మునిపల్లి(అందోల్): మహిళా డిగ్రీ గురుకుల కళాశాల, హాస్టల్ చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు అధ్యాపకులు, విద్యార్థినులు మంగళవారం తెలిపారు. 65వ నంబర్ జాతీయ రహదారి సమీపంలో కళాశాల ఉండటంతో విద్యార్థినులు బయటకు వెళ్లి ఎప్పుడు వస్తున్నారో, ఎక్కడకు వెళ్తున్నారో తెలియడం లేదన్నారు. స్టాఫ్ తక్కువగా ఉండటంతో విద్యార్థినులకు సెక్యూరిటీ లేకుండా పోతోందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి హాస్టల్, కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నాణ్యమైన విద్య అందించాలి

కొండాపూర్(సంగారెడ్డి): విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈఓ భీంసింగ్ అన్నారు. మంగళవారం కొండాపూర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల వసతి గృహాన్ని ఎంఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులను ఆహారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కొండాపూర్(సంగారెడ్డి): విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఏబీవీపీ కన్వీనర్ ఆకాష్ అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకాష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 9 ఏళ్లుగా విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్య సమితి సభ్యుడు చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పూజ, ప్రసాద్, శశాంక్, దినేష్, వెంకట్‌రెడ్డి రాజు, పవన్‌రెడ్డి, రాజు, వంశీ, ధ్యని పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



కొలతలు తీసుకుంటున్న అధికారులు

నారాయణఖేడ్: పట్టణంలోని గాంధీచౌక్ నుంచి సేవాలాల్‌చౌక్ మీదుగా ముదిరాజ్ సంఘం భవన సమీపంలోని జాతీయ రహదారి వరకు బైపాస్ సీసీ రోడ్డు విస్తరణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు కొలతలు తీసుకోగా పనులను మున్సిపల్ చైర్మన్ రుబీనా నజీబ్ పర్యవేక్షించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ అంజయ్య అన్నారు. మంగళవారం మండలంలోని రెజింతల్ పాఠశాల సందర్శించిన సమయంలో పారిశుధ్య కార్మికుడి కూతురు ముక్కగల్ల వెన్నెల గతేడాది 7వ తరగతి చదివి పాఠశాల మానివేసిందని ఎంఈఓ తెలుసుకుని ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా వెన్నెల, తండ్రి ఏసుదాసు, తల్లి ఏస్తార్‌తో మాట్లాడి సదాశిపేటలోని కస్తూర్బా పాఠశాలలో 8వ తరగతిలో చేర్పించి పుస్తకాలు అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే మాణిక్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

జహీరాబాద్: దశాబ్ద కాలంగా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదంటూ మహిళలు ఎమ్మెల్యే మాణిక్‌రావును కలిసి మొర పెట్టుకున్నారు. మంగళవారం పట్టణంలోని వసుంధరానగర్ కాలనీకి చెందిన మహిళలు అధికసంఖ్యలో వాహనాల్లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలివచ్చి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ కాలనీ ఏర్పడి 12 ఏళ్లు గడుస్తున్నా రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం జరగలేదని, విద్యుత్ దీపాలు సైతం వెలగడం లేదని వాపోయారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే సమస్యలు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సురేందర్, మహిళా అధ్యక్షురాలు గాయత్రి జోషి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాణిక్‌రావును కలిసిన ఢిల్లీ వసంత్

జహీరాబాద్: రైతు సంఘం నాయకుడు, సామాజిక ఉద్యమకారుడు ఢిల్లీ వసంత్ మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ నెల 10వ తేదీన జహీరాబాద్‌లో నిర్వహించనున్న సభలో బీఆర్ఎస్‌లో చేరనున్నట్టు సమాచారం.

పప్పుధాన్యాల విత్తనాల పంపిణీ



విత్తనాలను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

జహీరాబాద్: తెగుళ్లకు తట్టుకుని దిగుబడులను సాధించే పప్పుధాన్యాల విత్తనాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. మంగళవారం డీడీఎస్–కేవీకేల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అటారా, ఐసీఏఆర్‌ల ఆర్థిక సహాయంతో 175 ఎకరాలకు కంది రకం (బీఎస్ఎంఆర్–736, టీడీఆర్‌జీ–4), 50 ఎకరాలకు మినుము (జీబీజీ–1) విత్తనాలను మండలంలోని అర్జున్‌నాయక్ తండా, అల్గోల్, న్యాల్‌కల్ మండలంలోని వడ్డి, కోహీర్ మండలంలోని సిద్ధాపూర్ తండా, కంగ్టి మండలంలోని బీమ్రా, చౌకాన్‌పల్లి, కిషన్‌నాయక్ తండా, బోర్గి, బాబుల్‌గావ్ గ్రామాల రైతులకు విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రమేష్, స్నేహలత పాల్గొన్నారు.

ఖేడ్ ఆర్టీసీ సిబ్బందికి అవార్డులు



బీరయ్యకు అవార్డు అందజేస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

నారాయణఖేడ్: వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న పలువురు డ్రైవర్లు, కండక్టర్లు రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. ఇందన పొదుపు, ప్రమాద రహిత డ్రైవింగ్, అత్యధిక కలెక్షన్లు తీసుకువచ్చిన విభాగాల్లో డ్రైవర్లు బీరయ్య, దీప్లా, కండక్టర్లు ఆర్వి రావు, మాణిక్ ప్రభులను మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రగతిచక్రం వార్షిక పురస్కారాల్లో భాగంగా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఘనంగా సన్మానించి అవార్డులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆర్టీసీ ఈడీ పురుషోత్తం, ఆర్ఎం సుదర్శన్ పాల్గొన్నారు. అవార్డు పొందినవారిని ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తదితరులు అభినందించారు.

సంగారెడ్డి టౌన్: రోడ్డు రావాణా సంస్థ రాష్ట్రస్థాయి ప్రగతిచక్రం అవార్డు పొందిన ఆర్టీసీ కార్మికులకు మంగళవారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్, గౌరవచైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులను అందజేసినట్టు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుదర్శన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయిల్ పొదుపు విభాగంలో సంగారెడ్డి డిపోకు చెందిన డ్రైవర్ శ్రీశైలానికి రూ.50వేల నగదు పురస్కారం అందజేసినట్టు తెలిపారు. నర్సాపూర్ డిపోకు చెందిన సతీష్‌ను సెక్రటరీ విభాగంలో ప్రతిభ కనబరిచారన్నారు. దసరా చాలెంజ్ విభాగంలో 9 కండక్టర్లకు, ఏడుగురు డ్రైవర్లకు, సంక్రాంతి ఛాలెంజ్‌లో భాగంగా 9 మంది కండక్టర్లు, ఏడుగురు డ్రైవర్లు సన్మానం పొందారని తెలిపారు.

బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

హత్నూర (సంగారెడ్డి): బాసర ట్రిపుల్ ఐటీకి నలుగురు ఎంపికయ్యారు. హత్నూర మండలం దౌల్తాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి కైనట్లు హెచ్ఎం లక్ష్మారెడ్డి మంగళవారం తెలిపారు. పదో తరగతిలో చాముండేశ్వరీ, అయనుద్దీన్, కె.సంధ్య మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. అలాగే గుండ్లమాచునూర్ గ్రామానికి చెందిన ఆలుగుళ్ళ నితీష్ కుమార్ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. ఇతడు గుండ్ల మాచునూర్ మోడల్ స్కూల్ లో పదో తరగతి చదివాడు. 10 జీపీఏ సాధించాడు. ఇటీవల ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేసుకోగా తొలి జాబితాలోనే సీటు పొందాడు.

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని మిర్జాపూర్(బీ) జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అర్చన, సాయికుమార్, అల్తాఫ్ ట్రిపుల్ ఐటీకి ఎంపికై నట్టు ఎంఈఓ మారుతి రాథోడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఎంఈఓ, ఉపాధ్యాయులు అభినందించారు.

ధనసిరి విద్యార్థినికి..

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని ధనసిరి గ్రామానికి చెందిన గంగోత్రికి బాసర ఐఐటీలో సీటు వచ్చింది. ఈ మేరకు మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ హబ్సి రాజు ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ చింతా ప్రభాకర్‌ను కలిసిన అర్చకులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్‌ను హనుమాన్ దేవాలయ అర్చకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ధూప దీప నైవేద్యం పథకం కింద అర్చకులకు ప్రభుత్వం రూ.10వేలను అందించడం సంతోషంగా ఉందన్నారు.

◆ కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు

కొండాపూర్(సంగారెడ్డి): తెలంగాణ రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన కేంద్ర సహాయ మంత్రి కిషన్‌రెడ్డికి ఆ పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా తెలంగాణ ఎన్నికల కమిటీ చైర్మన్‌గా నియమితులైన హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

◆ పుస్తకాలు పంపిణీ ప్రారంభం

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రెండవ విడతలో భాగంగా మంగళవారం ఉచిత పుస్తకాల పంపిణీ ప్రారంభమైంది. 26 వేలకుపైగా పుస్తకాలు అవసరం ఉండగా గత జూన్‌లో 19వేలు రాగా మిగిలిన పుస్తకాలు సోమవారం ఎంఆర్‌సీ కార్యాలయానికి వచ్చిన పుస్తకాలను ఎంఈఓ మారుతి రాథోడ్ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు.

◆ కంగ్టి గ్రామ పంచాయతీ ఇన్‌చార్జిగా సుగుణ

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టి గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి సర్పంచ్‌గా మచ్కురి సుగుణను నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్టు పంచాయతీ సెక్రటరీ సుభాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఎన్నికల్లో సర్పంచ్‌గా ఎన్నికైన పూజ 2021 మార్చిలో అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటినుంచి ఉపసర్పంచ్‌గా ఉన్న కాడె నర్సమ్మ ఇన్‌చార్జి సర్పంచ్ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో కాడె నర్సమ్మకు మద్దతు లేకపోవడంతో రిపోర్టులు పరిశీలన అనంతరం హైకోర్టు ఉత్తర్వుల మేరకు కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి కంగ్టి గ్రామ పంచాయతీ 1వ వార్డు మెంబర్ సుగుణకు ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలు అప్పగిస్తూ జీఓ జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం సుగుణను వార్డు సభ్యులు, పంచాయతీ సెక్రటరీ సన్మానించారు.

◆ పరామర్శ

నారాయణఖేడ్: సిర్గాపూర్ మండలంలోని సింగార్ బొగుడ తండాకు చెందిన బుల్లిబాయి రెండు రోజుల క్రితం మూడో కాన్పు అనంతరం మృతి చెందిన విషయం విధితమే.. ఈ మేరకు మంగళవారం లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రకాష్‌రాథోడ్, ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, సిర్గాపూర్ మండల బాధ్యులు వినోద్, రాజు, మోహన్, నరేష్ తండాకు వెళ్లి బుల్లిబాయి చిత్రపటానికి నివాళులు అర్పించారు.

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని పల్వట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త బోయిని శివయ్య సోమవారం మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహా మృతుడి కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్‌జోషి, యువజన విభాగం అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లికి చెందిన పలువురు అనారోగ్యంతో బాధపడుతూ నారాయణఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ రుబీనా నజీబ్, మాజీ వార్డు సభ్యులు పత్రి విఠల్ మంగళవారం ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు.

◆ ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని బిడెకన్నె కొత్తకాపు అంజిరెడ్డికి భారత రాష్ట్ర సమితి నుంచి మంజూరైన రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కును కుటుంబ సభ్యులకు నామిని కాపు సంగమ్మకు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు అందజేశారు.

◆ నిత్యావసర సరుకుల పంపిణీ

నారాయణఖేడ్: మండలంలోని సత్తెగామ గ్రామానికి చెందిన అబ్రుల్లా నెలరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఐదేళ్ల క్రితం ఆయన పెద్ద కుమారుడు సైతం అనారోగ్యంతో మృతి చెందారు. ఇంటికి పెద్ద దిక్కయిన భర్తతో పాటు కుమారుడు మృతి చెందడంతో మౌలాన్‌బీ, ఆమె కోడలు జీవనాధారం కోల్పోయి దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. విషయం తెలుసుకున్న విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్టు చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ నెలకు సరిపడా నిత్యావసర సరుకులను సమకూర్చగా మంగళవారం ట్రస్టు సభ్యులు అంజాగౌడ్, శంకర్‌గౌడ్, మాణిక్యం ముదిరాజ్, గణేష్, సిద్దూ బాధిత కుటుంబానికి అందజేశారు.

◆ వైభవంగా బోనాల పండగ

వట్‌పల్లి(అందోల్): అందోల్, జోగిపేట మున్సిపాలిటీలోని ఆయా కాలనీలలో మంగళవారం బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అందోల్‌లోని పోచమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ప్రత్యేక పూజలు చేశారు.

మునిపల్లి(అందోల్): మండలంలోని మన్‌సాన్‌పల్లిలో ఎల్లమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో రైతుబంధు మండల అధ్యక్షుడు పరశురాంగౌడ్, పిల్లోడి ప్రభుగౌడ్, ఆలయ నిర్వాహకులు నర్సింహ్మాగౌడ్ పాల్గొన్నారు.

సదాశివపేట (సంగారెడ్డి): పట్టణంలో రేణుక ఎల్లమ్మ దేవస్థానం, సాగర్‌నగర్‌లోని ని భవానీ మందిరాల నుంచి బోనాల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ పిల్లోడి జయమ్మ, కౌన్సిలర్లు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడికి మాతృవియోగం

నారాయణఖేడ్: మనూరు మండలంలోని బోరంచకు చెందిన న్యాయవాది, ఖేడ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కొంగరి బోజిరెడ్డికి మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి కొంగరి అంజమ్మ(92) వృద్ధాప్యం కారణంగా సోమవారం రాత్రి మృతి చెందారు. మృతి పట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు సంతాపం ప్రకటించి మంగళవారం అంత్యక్రియల్లో పాల్గొన్నారు.